ప్రజాశక్తి
ఆదివారం 19 నవంబర్ 2023 5 అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

జీవో నెం:5తో రైతులకు నష్టం

◆ నామమాత్రపు పంట నష్టపరిహారంతో అవమానించొద్దు
◆ రైతుల కోసం 20న మండలాలు, 22న కలెక్టరేట్ వద్ద ఆందోళన
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 5లో రూపొందించిన పంటనష్ట పరిహారం నిబంధనలు జిల్లా రైతులకు తీరని అన్యాయం చేసేలా ఉన్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కరువు తీవ్రంగా ఉన్నప్పటికీ కరువు ప్రకటనకు చివరి రోజైన అక్టోబర్ 31 వరకు స్పందించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. జిల్లాలోని 31 మండలాల్లో 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం కరువు సహాయ చర్యలు చేపట్టకుండా ఆలస్యం చేయడం సరికాదన్నారు. 33 శాతానికి పైగా పంట నష్టం జరిగినట్లు ఉంటేనే పరిహారం అందుతుందనే నిబంధన రైతులను దగా చేయడమే అన్నారు. 1.86 వేల హెక్టార్లలో పంట నష్టపోయినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారన్నారు. వాస్తవంగా ఖరీఫ్‌లో సాగు అయిన పంటలన్నింటినీ రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. వేరుశనగ, పత్తి పంటలకు ఎకరాకు 40 వేలు పెట్టుబడి ఖర్చు కాగా ప్రభుత్వం రెండున్నర ఎకరాలకు కేవలం రూ.17 వేలు, ఇతర పంటలకు రూ.10 వేలు పరిహారంగా చెల్లించాలని నిర్ణయించడం రైతులను పరిహసించడమేనని విమర్శించారు. ఒకవైపు రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూ మరో వైపు రైతులను మోసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. వేరుశనగ, పత్తి పంటలకు ఎకరాకు రూ.40 వేలకుపైగా ఖర్చు అవుతుండగా కేవలం రూ.6,500 పరిహారం ఇచ్చి రైతులను ఆదుకుంటామని ఎలా చెబుతారని నిలదీశారు. రెండు ఎకరాల వరకు మాత్రమే పరిహారం ఇవ్వాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా ప్రతి పంటకు గరిష్టంగా 10 ఎకరాల వరకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రితో చర్చించి పంట నష్టపరిహారం పెంపుదల చేయాలన్నారు. 10 ఎకరాల వరకు పరిహారం అందించేందుకు కృషి చేయాలన్నారు. వ్యవసాయ కూలీలకు 200 రోజులు ఉపాధి హామీ పనులు, రోజుకు రూ. 600 కూలీ ఇవ్వాలన్నారు. అన్ని రకాల విద్యార్థులకు ఫీజులు మాఫీ చేయించాలన్నారు. లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో ప్రజలు ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఈ నెల 20న జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల వద్ద, 22న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సిపిఎం చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో రైతులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ. నల్లప్ప, ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్ర, బి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రికెట్ ఫీవర్

◆ ఉమ్మడి జిల్లాలో క్రికెట్ సందడి
◆ నేటి ఫైనల్ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి
◆ పలు ప్రాంతాల్లో బిగ్ స్క్రీన్స్ ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతపురంప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రికెట్ ఫీవర్ కొనసాగుతోంది. ఆదివారం నాడు అహ్మదాబాద్‌లో ఇండియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారతదేశంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఇండియా లీగ్ దశ నుంచి కూడా అప్రతిహతంగా ఓటమి అన్నది లేకుండా విజయాలు సాధిస్తూ వచ్చింది. దీంతో ఫైనల్ విజయావకాశాలపైనా అంచనాలు భారీగానే ఉన్నాయి. నేడు జరిగే ఫైనల్లో కూడా గెలిస్తే ఓటమిన్నది లేకుండా గెలిచిన జట్టుగా ఇండియా ఉండబోతోంది. అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు బౌలింగులోనూ అందరు ఆటగాళ్లు మంచి ఫామ్‌లో ఉండి రాణిస్తుండటం ప్రపంచకప్ విజయంపై అంచనాలు భారీగా పెరిగాయి. దీంతో ఎక్కడ చూసినా నేడు జరిగే ఫైనల్స్‌పైనే చర్చ నడుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్ కోసం ఉమ్మడి క్రికెట్ అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ప్రపంచ కప్ విజయం తరువాత ఏ రకంగా సంబరాలు చేసుకోవాలన్న ప్లాన్‌లోనూ ఉంటున్నారు.

ప్రత్యేకమైన ఏర్పాట్లతో సిద్ధం

టీమ్ ఇండియా ప్రపంచ్ కప్ ఫైనల్ విజయం కోసం ప్లాన్ చేసుకుంటుంటే, అభిమానులు ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు ప్రత్యేకంగా ప్లాన్‌లు చేసుకుంటున్నారు. అనంతపురం నగరంలో అయితే పిటిసి స్టేడియంలో భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసేందుకు అభిమానులు సిద్ధమయ్యారు. పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేసి నగరవాసులు అత్యధిక మంది అక్కడ మ్యాచ్‌ను తిలకించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే రకంగా మరికొంత మంది హోటల్స్‌లో సన్నిహితులతో కలసి మ్యాచ్‌లు తిలకించే విధంగా ప్లాన్ చేసుకున్నారు. ఆదివారం కూడా కావడంతో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకుని భారత విజయాన్ని ఆకాంక్షిస్తూ సంబరాలకు సిద్ధమయ్యారు.

బెట్టింగ్‌లకు సిద్ధం

ఇదే సమయంలో బెట్టింగ్‌లకు బెట్టింగ్ జూదరులు సిద్ధమవుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు కొంత మంది సిద్ధమవగా, మరికొంత మంది వ్యక్తిగతంగానూ పందేలు కాయడానికి సిద్ధమవుతున్నారు. అయితే ఇప్పటికే పోలీసు శాఖ వీటిపై నిశితంగానే దృష్టి పెట్టింది. ఇటువంటివి చోటు చేసుకున్నట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు సైతం చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ఫైనల్ మ్యాచ్ కావడంతో అందరి అంచనాలు భారీగానే ఉంటున్నాయి.

ఇండియా జట్టు పటిష్టంగా ఉంది

టీమ్ ఇండియా జట్టు బ్యాటింగ్, బౌలింగ్ అన్ని విభాగాల్లోనూ గతంలో ఎన్నడూ లేనంత పటిష్టంగా ఉంది. అందుకే లీగ్ దశ నుంచే ఒక్క ఓటమి అన్నది లేకుండా వరుస విజయాలు సాధిస్తూ వచ్చింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లోనూ ఆస్ట్రేలియాను ఓడించి మూడవసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంటుందన్న నమ్మకముంది.

టివి.చంద్రమోహన్‌రెడ్డి, సీనియర్ క్రికెటర్.

టీమ్ ఇండియా గెలుస్తుంది

టీమ్ ఇండియా ఫైనల్ మ్యాచ్‌లోనూ గెలవాలని ఆకాంక్షిస్తున్నా. ఇప్పటి వరకు జరిగిన అన్ని మ్యాచ్‌ల్లోనూ ఓటమన్నది లేకుండా ఏ రకంగా గెలుపొందిందో... అదే రకంగా ఫైనల్ మ్యాచ్‌లోనూ గెలుపొంది.. ప్రపంచ కప్ విజేతగా నిలవాలని కోరుకుంటున్నాం.

నరేష్, యువకుడు.

ఎకరాకు రూ.50వేలు చెల్లించాలి

జీవో.5ను సవరించాలి - ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు చెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎపి రైతుసంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 9.15 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారన్నారు. వీటిలో 2.28 లక్షల ఎకరాల్లో కేవలం వేరుశనగ సాగైందన్నారు. అయితే వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటలు పూర్తిగా నాశనమయ్యాయన్నారు. ఆఖరికి పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. ఈనేపథ్యంలో కరువు మండలాలు ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తే స్పందించిన ప్రభుత్వం కరువు సహాయం నష్టం అంచనా వేసేందుకు జీవో 5ను విడుదల చేసిందన్నారు. అయితే దీని ద్వారా రైతులకు వేరుశెనగ పత్తి పంటలకు (హెక్టార్లలో) రూ.17వేలు, జొన్న, సజ్జ, ఆముదం పంటలకు రూ.8,500, కంది, ఆపరాలు, పొద్దుతిరుగుడు, సోయాబీన్ పంటలకు రూ.10వేలు, మొక్కజొన్న పంటకు రూ.12,500 ఇస్తామని ప్రకటించిందన్నారు. అయితే ఇలా ఇవ్వడం ద్వారా రైతులకు ఏమాత్రం మేలు చేకూరదన్నారు. కావున జీవో.5ను సవరించి ఏ పంట సాగు చేసినా కనీసం ఎకరాకు రూ.10వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పోతులయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నారెడ్డి, లక్ష్మీదేవి, సువర్ణమ్మ, చిదంబరమ్మ, నారాయణరెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, సూర్య, కొండారెడ్డి, వెంకట కొండ, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు

రేపు కలెక్టరేట్ ముట్టడి

గన్నెవారిపల్లి పంచాయతీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

'పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని 12 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నాం... అయినా ఏ ఒక్కరూ స్పందించిన పాపానపోలేదు.. దీంతో వచ్చే సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం' తాడిపత్రి రూరల్ గన్నెవారిపల్లి పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. ఈమేరకు శనివారం రూరల్ పరిధిలోని కడప రోడ్డు నుంచి రామాలయం, రూరల్ పోలీస్‌స్టేషన్ వరకూ పంచాయతీ కార్మికులు అర్ధనగ్నం ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు, కార్మికులు మాట్లాడుతూ పంచాయతీని ఎప్పటికప్పుడు శుభ్రం చేసే కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా ప్రాణాలకు తెగించి పనులు చేసిన తమ ఆకలి కేకలు ప్రభుత్వానికి పట్టవా.. అని నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. అప్పటికీ స్పందించకపోతే స్థానిక సర్పంచి, ఎంపిడిఒల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అయినా వేతనాలు చెల్లించకపోతే ఈనెల 23వతేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, పంచాయతీ కార్మికులు రాజు, రామకృష్ణ, కుళ్లాయప్ప, ఓబయ్య, సంధ్యాభాయి, కార్మికులు పాల్గొన్నారు.

అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న గన్నెవారిపల్లి పంచాయతీ కార్మికులు

పలు రైళ్లు రద్దు..కొన్ని దారి మళ్లింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ పరిధిలోని కారటగి-సిద్ధాపూర్ స్టేషన్ల నడుమ మరమ్మతులు జరుగుతున్నందున పలు రైళ్లను దారి మళ్లించడంతోపాటు మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేసినట్లు నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ అనీష్ హెగ్డే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యశ్వంత్‌పూర్-కారటిగి నడుమ ప్రయాణించే రైలును ఈనెల 22వ తేదీ నుంచి డిసెంబర్ మొదటి తేదీ వరకూ కారటిగి నుంచి కాక గంగావతి-యశ్వంత్‌పూర్ నడుమ నడుస్తుందన్నారు. అలాగే గంగావతి-కారటగి నడుమ ప్రయాణించే రైలును రద్దు చేసినట్లు తెలిపారు. బీజాపూర్-యశ్వంత్‌పూర్ నడుమ ప్రయాణించే రైలు ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకూ దావనగేరి మార్గం మీద నుంచి కాకుండా రాయదుర్గం, బళ్లారి, హొసపేట మీదుగా ప్రయాణించనున్నట్లు తెలిపారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

కరువు మండలాల జాబితాలో ఉన్న రాయదుర్గం మండలంలో కరువు జాబితా తయారు చేసేందుకు క్షేత్రస్థాయికి వెళ్లి పంటలను పరిశీలన చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మహేంద్ర తెలిపారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది, విలేజ్ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్లు కలిసి క్షేత్ర పర్యటన చేసి 33 శాతం కంటే ఎక్కువ దెబ్బతిన్న పంటలను గుర్తించి జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. 20వ తేదీ వరకూ క్షేత్రస్థాయిలో పర్యటించి 21 నుంచి 25వ తేదీ వరకూ సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రంలో జాబితాను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 21 నుంచి 27వ తేదీ వరకూ అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. కాగా ఖరీఫ్‌లో పంట సాగు చేసిన ఈ-పంట నమోదు చేయించుకున్న రైతులు సోమవారం సాయంత్రంలోగా పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పుస్తకం నకళ్లను ఆర్‌బికె సిబ్బందికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, విలేజ్ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఒ మహేంద్ర

ఈవీఎం, వివి ప్యాట్స్ పరిశీలన

ఈవీఎంల గోడన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమంలో రిజెక్ట్ అయిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్‌లను బెల్ కంపెనీకి త్వరలో తిరిగి పంపుతామని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. శనివారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం కాంపౌండ్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 16వ తేదీ నుంచి ఈనెల 9వతేదీ వరకు ఈవిఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో 89 బ్యాలెట్ యూనిట్స్, 82 కంట్రోల్ యూనిట్స్, 218 వివి ప్యాట్స్‌లు ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమంలో రిజెక్ట్ యూనిట్స్ ఉన్నాయన్నారు. రిజెక్ట్ అయిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్‌లను స్కాన్ చేసి బెల్ కంపెనీకి పోలీస్ బందోబస్తుతో తిరిగి పంపనున్నట్లు తెలిపారు. గోడౌన్‌లో పటిష్ట బందోబస్తుతో ఈవిఎంలను భద్రపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్రంధి వెంకటేష్, తహశీల్దార్ బాలకిషన్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజుతో పాటు వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జెఎన్‌టియులో ముగిసిన ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్

విద్యార్థుల కేరింతలతో మార్మోగిన కళాక్షేత్రం

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల, జాతీయ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్-2023 శనివారం రాత్రి వైభవంగా ముగిసింది. విద్యార్థినీ, విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వర్శిటీలోని ఎన్‌టిఆర్ కళాక్షేత్రం మార్మోగింది. అదేవిధంగా విద్యార్థులకు పలు వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తర్వాత విద్యార్థులే స్వయంగా సంప్రదాయ వంటకాలను తయారు చేసి ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యంగా కేవలం రూ.65కు గ్యాంగ్‌స్టార్ బిర్యానీ కౌంటర్ పెట్టడంతో కిటకిటలాడింది. అదేవిధంగా రాయలసీమ బజ్జీల కౌంటర్‌కు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఉపకులపతి రంగాజార్ధన, రిజిస్ట్రార్ శశిధర్, ప్రిన్సిపల్ సత్యనారాయణ, కన్వీనర్ జి.మమత, తదితరులు పాల్గొన్నారు.

పని చేసి ఓటు అడుగుతున్నాం..

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

దేశ, రాష్ట్ర చరిత్రలో ఎవరూ చేయని విధంగా నిజాయితీగా సంక్షేమ పథకాలను అమలు చేసి వచ్చే ఎన్నికల్లో ఓటు అడిగేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం రాప్తాడు మండలం బండమీదపల్లిలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ భవనాలను ప్రారంభించారు. అనంతరం రెడ్డి కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఎమ్మెల్యే సొంత నిధులు రూ.40లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ రంగంలో చూసినా నిజాయితీగా పనులు చేశామన్నారు. అంతేగాకుండా సిఎం జగన్ రాష్ట్రంలోని ప్రజలు, మహిళలు, రైతులను సొంత కుటుంబ సభ్యుల్లా భావిస్తారన్నారు. ప్రజల ప్రేమికుడైనా సిఎం జగన్ అడుగుజాడల్లో నడుస్తున్నామన్నారు. దాదాపు 40ఏళ్లు ఎమ్మెల్యేగా, మంత్రుగా పని చేసిన పరిటాల కుటుంబం కనీసం బండమీదపల్లి ప్రధాన రహదారిని పట్టించుకోలేదన్నారు. అలాంటి రోడ్డును తమ సొంత నిధులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపిపిలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, గృహసారథులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్టోర్ డీలర్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

దొంగ ఓట్ల పని టిడిపిదే : విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో దొంగ ఓట్ల నమోదు, వైసిపి సానుభూతిపరుల ఓట్ల తొలగింపు చర్యలు టిడిపినే చేస్తోందని విప్ కాపు రామచంద్రారెడ్డి ఆరోపించారు. శనివారం సాయంత్రం రాయదుర్గంలో రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకుల తీరు 'దొంగే దొంగ' అని అరిచినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పది రోజుల క్రితం ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాను విడుదల చేయగా తాము ఇంతవరకూ ఆ జాబితా పరిశీలనకు వెళ్లలేదన్నారు. 2018లో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు విపరీతంగా బోగస్ ఓట్లు నమోదు చేసి కొన్నిచోట్ల విజయం సాధించిందన్నారు. దొంగ ఓట్లు నమోదు కాకపోతే ఆ పార్టీకి 23 ఎమ్మెల్యే స్థానాలు కూడా దక్కేవి కాదన్నారు. ఇక రాయదుర్గం నియోజకవర్గంలో 2019 ఎన్నికల నాటికి 48 వేల బోగస్ ఓట్లు ఉన్నాయన్నారు. కొత్తగా ఓటరు జాబితాలో నమోదు చేసేందుకు ఎన్నికల కమిషన్‌కు 12 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 10శాతం సామాన్యులు దరఖాస్తు చేసుకుంటే మిగతా 90 శాతం టిడిపికి చెందినవే ఉంటాయన్నారు. కాగా రాయదుర్గం-భూపసముద్రం రోడ్డు నుంచి కలుగోడుకు, కనేకల్- ఉరవకొండ రోడ్డు నుంచి కలేకుర్తి మీదుగా గుండ్లపల్లి వరకూ బిటి రోడ్డు నిర్మాణానికి రూ.8.45 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, గృహ నిర్మాణ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ ఐ.శ్రీనివాసులు, వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిటిపి గోవిందు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలిబాష, మున్సిపల్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

పకడ్బందీగా ఓటరు సర్వే చేయాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కరుణకుమారి

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గ పరిధిలో మృతిచెందిన, శాశ్వత వలసలు వెళ్లిన ఓటర్ల వివరాల విచారణను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కరుణకుమారి సూచించారు. శనివారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ, ఎన్నికల అధికారులతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో మృతిచెందిన ఓటర్లు 8 వేలకుపైగా ఉన్నారన్నారు. అంతేకాక అనేకమంది కర్ణాటక రాష్ట్రంలో, రాయదుర్గం నియోజకవర్గంలో రెండేసి ఓటుహక్కును కలిగి ఉన్నారన్నారు. ఇందుకు రిటర్నింగ్ అధికారిణి స్పందిస్తూ ఇప్పటికే రెవెన్యూ, ఎన్నికల అధికారులు మూడు వేల మంది మృతిచెందిన ఓటర్ల వివరాలు సేకరించి ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు సిఫార్సు చేశారన్నారు. మిగిలిన వారికి కూడా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపోతే విద్య, ఉద్యోగరీత్యా తాత్కాలిక వలస వెళ్లిన వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించే వీలు ఉండదన్నారు. ఎవరైనా ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రం, విదేశాల్లో ఓటర్లుగా ఉన్నట్లు విచారణలో తేలితే తొలగిస్తామన్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఇదివరకూ రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గంలో 293 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా మూడు కేంద్రాలు కేంద్రాలు మంజూరైనట్లు తెలిఆపరు. వీటిలో బొమ్మనహాల్ మండలం గౌనూరు, రాయదుర్గం మండలం రాతిబావి వంక, మల్లాపురం తండాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కరుణకుమారి

గుంతల రోడ్లపై టిడిపి, జనసేన నిరసన

రుద్రంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్
నగర సమీపంలోని రుద్రంపేటలో గుంతల మయంగా మారిన రోడ్లపై టిడిపి, జనసేన నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నగర అధ్యక్షుడు మారుతీకుమార్‌గౌడ్, జనసేన ఇన్‌ఛార్జి వరుణ్, రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న మాట్లాడుతూ నాలుగేళ్ల వైసిపి పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయిందన్నారు. ముఖ్యంగా ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయంగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరేష్‌చౌదరి, బంగి నాగ, సరిపూటి రమణ, గోపాల్‌గౌడ్, రుద్రంపేట ఎస్.ఎం.బాషా, ముక్తియార్, పోతుల లక్ష్మీనరసింహులు, తెలుగు మహిళలు విజయశ్రీరెడ్డి, సంగా తేజస్విని, జనసేన నాయకులు పెండ్యాల శ్రీలత, బాబురావు, జయరామిరెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండలంలోని తాడిపత్రి-ధర్మవరం మెయిన్ రోడ్డులో బి.పప్పూరు గ్రామ సమీపంలో ఉన్న గుంతల రోడ్లపై టిడిపి, జనసేన నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి, అక్రమాలు, దౌర్జన్యాలు తప్ప చేసిందేమీ లేదన్నారు. ముఖ్యంగా ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి గుంతల రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ ఎర్రినాగప్ప, జనసేన కన్వీనర్ రామకృష్ణ, చంద్రబాబు, అమిలినేని సత్తి, గుత్తా నాయుడు, మలిరెడ్డి, లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, నాగభూషణ, గురు, తిరుపతయ్య, పెద్దుల నాయుడు, బాలకృష్ణ, శీనప్ప, నారాయణప్ప, భాస్కర్, వెంకటరాముడు, నరసన్న, పాపారాయుడు, అరవింద్, శేషప్ప, నాగేష్, వెంకటనారాయణరెడ్డి, నాగేంద్ర, వెంకటరమణ, వెంకటరమణప్ప, రంగయ్య, లింగప్ప, జయప్ప, ధనశేఖర్, నారాయణస్వామి, భాస్కర్, లోకేష్, నారాయణస్వామి, రహంతుల్లా, భాస్కర్, నరసింహ, శరత్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గుత్తి : ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన రోడ్లను నిర్మించాలని టిడిపి, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని చెరువు కట్ట సమీపంలోని రహదారిపై ఉన్న గుంతల వద్ద టిడిపి, జనసేన ఆధ్వర్యంలో గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గుంతల వద్ద నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బర్దివలి, మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మోడే శ్రీనివాస్ యాదవ్, సర్పంచి పి.భరత్ కుమార్, ఎంపిటిసి ధనుంజయ, నాయకులు చిన్నరెడ్డి యాదవ్, మహమ్మద్ అలీ నరసింహులు మోహన్ దాస్, కొత్తపేట సూరి, అగ్గి రాముడు, ఈరన్న, జనసేన నాయకులు సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి : ఎంపిపి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నరసింహులు

ప్రజాశక్తి-ఉరవకొండ
మండల స్థాయి సర్వసభ్య సమావేశాలకు వచ్చే అధికారులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఉరవకొండ ఎంపీపీ నరసింహులు హెచ్చరించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశం భవనంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి జరిగే సమావేశాలకు మండల స్థాయి అధికారులు కచ్చితంగా సమయానికి హాజరు కావాలన్నారు. సభ్యులు అడిగే సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశానికి అధికారులు ఎవరైనా గైర్హాజరైతే శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ముందుగా వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు వారి పరిధిలోని ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ అనంతరం ఎంపిటిసి ప్రసాద్, రేణమకలపల్లి సర్పంచి రామాంజనేయులు మాట్లాడుతూ పట్టణంతోపాటు వివిధ గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని, పంపిణీ చేసే చోట్ల తూకాలు సక్రమంగా ఇవ్వలేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఉరవకొండలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఇందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ పైప్‌లైన్ నిర్మాణం పనులు జరుగుతున్నాయని పూర్తయిన వెంటనే సమస్య పరిష్కరిస్తామన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను లేవనెత్తారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపిపి శ్రీనాథ్‌రెడ్డి, ఎంపిడిఒ అమృతరాజు, డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్, అడ్మినిస్ట్రేషన్ అధికారి జయరాములు, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

టిడిపి మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అనంతపురం కలెక్టరేట్ : వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అర్బన్ టిడిపి కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితా పరిశీలనను పక్కాగా చేపట్టాలన్నారు. ఇప్పటికే నగరంలో అనేక ఓట్లను తొలగించారని, వాటిని పరిశీలించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా టిడిపి సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ పరిశీలకుడు రమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళీ, మారుతీకుమార్‌గౌడ్, డిష్ నాగరాజు, సరిపూటీ రమణ, మార్కెట్ మహేష్, పరిమి రాజారావు, ముక్తియార్, గుర్రం నాగభూషణ, వన్నూర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

రాయదుర్గం : పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని రాయదుర్గం జంక్షన్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ సి.ఉమా మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వేస్టేషన్ ఆవరణలో బహిరంగ మలమూత్ర విసర్జన, మద్యం తాగడం నిషేధించామన్నారు. అదేవిధంగా ద్విచక్ర వాహనాలు, సైకిళ్లను రైల్వే ప్లాట్‌ఫారం ఆవరణలో ఉంచితే రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయిస్తామన్నారు. టికెట్ లేకుండా ప్లాట్‌ఫారంలోకి ప్రవేశిస్తే జరిమానా విధిస్తామన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తరిమెల పిహెచ్‌సి వైద్యురాలు

జాయినింగ్ లెటర్ అందజేస్తున్న డాక్టర్ తేజస్విని

శింగనమల : మండలంలోని తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా తేజస్విని శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ ఫిర్దోస్ పీజీకి వెళ్లడంతో ఆమె స్థానంలో అనంతపురంలో పని చేస్తున్న తేజస్విని బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు శింగనమల వైద్యులు డాక్టర్ శంకర్‌నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానన్నారు.

In the court of the Ist Addl. Junior Civil Judge:Ananthapuramu
O.S.No:74/2022
Between:
Yanamala Vishnu Vandana Devi and another ...Plaintiffs
And
Vardhi Reddy Bala Nagi Reddy and others ...Defendants
Notice to Defendant No:5, 6 & 7
D5:Yeddulapalli Raghavendra Prasad S/o Nagasheshana Naidu,
D6:Yeddulapalli Kalpana W/o N.Shashidhar
D7:Yeddulapalli Nirmala W/o P.Sai Krishna
All are R/at D.No:2-28A, G.Krishna Reddy Colony, JNTU Post Office Road, JNTU Collage Road, Ananthapuramu.
పై నెంబరు కేసును ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 22-11-2023వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
K.SREENIVASA REDDY,
ADVOCATE, ANANTHAPURAMU
L.LOKESWARA REDDY,
ADVOCATE, KADIRI

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
S.O.P.NO:05/2023
Between:
M.శ్రీలత W/o Late M.రవి,R/o H.No:2/42 New S.C.Colony, మిడుతూరు గ్రామం, పెద్దవడుగూరు మండలం, అనంతపురం జిల్లా. ...పిటీషనర్
V/S
1.M.లక్ష్మీదేవి W/o M.నాగరాజు,
2.M.శ్రేష్ట D/o Late M.రవి, Aged 10 Years, Minor Represented by Guardion Grand Mother Ist Respondant. Both are R/o H.No.4/277 Gandhi Nagar, Narpala Road, Bukkarayasamudram Village & Mandal, Ananthapuramu Dist.
...రెస్పాండెంట్స్
ప్రకటన
పై నెంబరు కేసులో M.రవి తన జీవిత కాలములో XL Health Corporation India Pvt, Ltd, బెంగుళూరు కంపెనీ నందు ఉద్యోగము చేస్తూ 20/6/2021వ తేదిన మరణించినారు. పై S.O.P నందు అర్జీదారురాలు మరియు రెస్పాండెంట్సు No.1 & 2 తాము సదరు M.రవి వారసులమనియు సదరు పై కంపెనీలో వున్న మొత్తంను అధికారుల నుంచి అర్జీదారురాలకు రావలసిన 1/3 భాగ మొత్తమును చెల్లించుటకు వీలుగా వారసత్వం సర్టిఫికేట్ కొరకు మంజూరు చేయవలసినదిగా పై కోర్టు నందు అర్జీదాఖలు చేసియున్నారు. అందులకు పైన తెల్పిన రెస్పాండెంట్స్ కాక ఇతరులకు ఎవరికైన ఆక్షేపణలున్న యెడల అట్టి వ్యక్తులు సదరు కోర్టు నందు 24/11/2023 వ తేదిన ఉదయం 10:30 గం॥లకు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల కోర్టు వారు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.
షెడ్యూలు

SL. No	Nature of The Amount	Tenatative Amount
1	Group Term Insurance	Rs.24,40,000/-
2	Full & Final Settlement	Rs.1,12,501/-
3	Gratuity	Rs.1,41,347/-
4	Covid 19 Momorial Pay	Rs.12,29,400/- (USD $ 15,000)
		Rs.39,23,400/-

కె.సుదర్శన్ రావు, యస్.శ్రీనివాసులు,
న్యాయవాదులు గుత్తి,

నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్యలు

ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ

మాట్లాడుతున్న ఉరవకొండ ఎడిఎ పద్మజ

ప్రజాశక్తి-ఉరవకొండ
నాసిరకం ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ హెచ్చరించారు. శనివారం విడపనకల్ మండలంలోని సాయి సిద్ధేశ్వర, వెంకటేశ్వర, గ్రోమోర్, లక్ష్మీ దొడ్డ బసవేశ్వర ఎరువులు దుకాణాలను మండల వ్యవసాయాధికారి పెన్నయ్యతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా లక్ష్మీ దొడ్డ బసవేశ్వర దుకాణంలో రికార్డులు సక్రమంగా లేకపోవడంతో రూ.1,95,000 విలువజేసే ఎరువులు, గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణంలో రూ.25 వేలు విలువజేసే ఎరువుల విక్రయాలను నిలుపుదల చేసినట్లు తెలిఆపరు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ రైతులను మోసం చేసేవిధంగా నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులను విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామన్నారు.

ఫర్టిలైజర్స్ డీలర్లకు సమీక్ష

మండలంలోని ఫర్టిలైజర్ షాపుల డీలర్లతో మండల వ్యవసాయ అధికారి శుభకర్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరవకొండ డివిజన్ ఏడిఏ పద్మజ మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపుల డీలర్లు పూర్తిస్థాయి అనుమతుల పత్రాలు కలిగి ఉండాలన్నారు. అలాగే నాణ్యమైన ఎరువులు, విత్తనాలనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

ఆర్టీటీ సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ

మాట్లాడుతున్న ఆర్టీటీ సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం
బాలల హక్కుల పరిరక్షణకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి) ఎనలేకి కృషి చేస్తోందని ఆర్టీటీ సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో ఆర్టీటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా పురవీధుల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీటీ సంస్థ కర్ణాటక సరిహద్దు మండలాల్లో ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణకు ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా బాల్యవివాహాల నిర్మూలనకు గ్రామస్థాయిలో పాఠశాలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఇఒ శ్రీకృష్ణనాయక్ మాట్లాడుతూ నేటి సమాజంలో బాలల పట్ల వివక్ష తీవ్రరూపం దాల్చిందన్నారు. ముఖ్యంగా బాల్యవివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఈ సమయంలో బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కృపమ్మ, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఎస్ఓ మహాలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కాశీం బీ, రామంజినమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రామలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఆర్‌ఎం

అనంతపురం : అనంతపురంలోని ఆర్‌ఎం కార్యాలయంలో శనివారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆధోనికి ఏడు ఫోన్ కాల్స్ వచ్చినట్లు తెలిపారు. ఆయా సమస్యలను త్వరలో పరిష్కరించనున్నట్లు ఆర్‌ఎం తెలిపారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి : మేయర్

డ్రెయినేజీలను పరిశీలిస్తున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్
ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. శనివారం నగరంలోని 38వ డివిజన్ పరిధిలో అధికారులతో కలిసి పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన మేయర్ త్వరితగతిన ఆయా సమస్యలు పరిష్కరించే దిశగా అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఇఇ సూర్యనారాయణ, ఏఈ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం
నగరంలోని ఆది మూర్తి నగర్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాల 9వ బ్రాంచిలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల ఏజిఎం సుబ్బారెడ్డి, మోటార్ వెహికల్ బ్రేక్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు భద్రత, నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా మైనర్లు రోడ్డుపై వాహనాలు నడపరాదన్నారు. ఆలాకాకుండా విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వాహనదారులు హెల్మెట్లు ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించడంతోపాటు నియమిత వేగంతో నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంత, అకాడమిక్ జిల్లా కోఆర్డినేటర్ తిరుమలేసు, అకాడమిక్ డీన్ గంగాధర్, ప్రైమరీ ఇన్‌ఛార్జి చంద్రకళ, ప్రీ-ప్రైమరీ ఇన్‌ఛార్జి బత్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-నార్పల
పొగాకుకు దూరంగా ఉండాలని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ నారాయణస్వామి సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పొగాకు నియంత్రణ, ఫ్లోరోసిస్ నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వల్ల అనేక దుష్పరిణామాలు ఏర్పడుతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ బీడీ, సిగరెట్, గుట్కా, పాన్ మసాలా, ఖైనీ, జర్దా వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ రామాంజినేయులు, జిల్లా పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త, జిల్లా కమ్యూనిటీ మొగలైజర్ శ్రీరాములు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సూపర్‌వైజర్ అక్కులప్ప, ప్రమీలమ్మ, సికె.రాయుడు, మునిరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడుదాం..

కుమ్మర శాలివాహన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మదనపు పోతలయ్య

మాట్లాడుతున్న కుమ్మర శాలివాన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మదనపు పోతులయ్య

ప్రజాశక్తి-అనంతరం కలెక్టరేట్
రాష్ట్రంలో కొన సాగుతున్న వైసిపి రాక్షస పాలనకు కలిసికట్టుగా చరమగీతం పాడుదామని కుమ్మర శాలివాన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మదనపు పోతులయ్య పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని 5వ రోడ్డులో బీసీల భరోసా బాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కుమ్మరి చేతివృత్తిదారులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో కుమ్మర్లు తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. కావున 2024లో టిడిపిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కుమ్మర శాలివాహన సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కె.ఓబుళపతి, నాయకులు గోవిందు, ఎర్రిస్వామి, జయలక్ష్మి, నాగరత్న, లక్ష్మీదేవి, ఆంజనేయులు, శ్రీరాములు, చిన్న వెంకటేశులు, గోవిందమ్మ, సరోజమ్మ, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పివికెకె ఐటిలో స్వాగతోత్సవం

మాట్లాడుతున్న పివికెకె కళాశాల చైర్మన్ పల్లె కిషోర్

ప్రజాశక్తి-అనంతపురం
రుద్రంపేటలోని పివికెకె ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం శనివారం ఘనంగా స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేరళ విశ్రాతం డీజీపీ శంకర్‌రెడ్డి నేటి ఆధునిక యుగంలో ప్రతి విద్యార్థికీ నిరంతరం జ్ఞాన సముపార్జన అవశ్యకమన్నారు. ఇందుకోసం ఇంటర్నెట్‌ను ఒక గొప్ప అవకాశంగా భావించి ఆన్‌లైన్ ద్వారా తమ ప్రతిభాపాఠవాలను ఎంతగానో మెరుగుపరుచుకోవచ్చన్నారు. వీటితోపాటు విద్యార్థి దశలోనే చక్కని నడవడికలు నేర్చుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ పల్లె కిషోర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని విద్యను అభ్యసించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి సింధూర, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, పీవీకెకె ఐటీ ప్రిన్సిపల్ బండి రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్రప్రసాద్, ఎఒ మనోహర్‌రెడ్డి, డిప్లొమా ప్రిన్సిపల్ వైభవ్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

పుట్లూరు : భార్యాభర్తలు గొడవలు పడి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని అరకట్టి వేముల గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అరకటివేములకు చెందిన సుబ్బమ్మ (40) భర్త మద్యం తాగేవాడు. దీంతో భార్యాభర్తలు గొడవ పడుతూ ఉండేవారు. ఈనేపథ్యంలో గురువారం సాయంత్రం కూడా భర్తతో గొడవపడి ఇంట్లో గడ్డికి పిచికారీ చేసే మందు తాగింది. గమనించిన బంధువులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిఆపరు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణకు చర్యలు

పారిశుధ్యం పనులను చేయిస్తున్న అధికారులు

గుత్తి : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. శనివారం పట్టణంలోని 15వ వార్డులో ఉన్న పెద్ద కాలువను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా, మున్సిపల్ ఏఈ సాయినాథ్ బాబు, కౌన్సిలర్ మాతంగి అంజలా, వైసిపి నాయకులు హమాలీ రామంజి, అరటిపళ్ల చంద్ర, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మలేరియాను నివారిద్దాం

మాట్లాడుతున్న జిల్లా మలేరియా నివారణ అధికారి డి.ఓబులు

అనంతపురం : జిల్లాలో మలేరియా వ్యాధిని పూర్తిగా నివారించడానికి అన్ని శాఖల అధిపతులతో మమేకమై పని చేస్తున్నట్లు జిల్లా మలేరియా నివారణ అధికారి డి.ఓబులు తెలిపారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన మలేరియా ఎలిమినేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం, పుట్టపర్తి జిల్లాల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజర్స్ ప్రణాళికాబద్ధంగా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి కె.సత్యనారాయణ, విస్తరణాధికారి కె.గిరిధర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు

ఉరవకొండ : పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో శనివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి తెలిపారు. వైద్య పరీక్ష నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏ.గౌస్‌సాహెబ్ సూచన మేరకు గురుకుల పాఠశాల చుట్టుపక్కల దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సునీత, ఎంఎల్‌హెచ్‌పి సులోచన, ఆశా కార్యకర్తలు, పాఠశాల, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెన్నహోబిలేసుడి పల్లకిసేవ

ఉరవకొండ : మండలం పెన్నహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి పల్లకి సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి పల్లకిలో మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ఎంపిపి నరసింహులు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అశోక్‌కుమార్, సిబ్బంది, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఇండియాకు 'మోక్షిత్' విద్యార్థుల శుభాకాంక్షలు

అనంతపురం : ప్రపంచ క్రికెట్ కప్ ఫైనల్‌కు వెళ్లిన టీం ఇండియా జట్టు ఫైనల్లో కూడా గెలవాలని నగరంలోని మోహిత్ పాఠవాల విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక పాఠశాలలో 'ఆల్ ద బెస్ట్ టీమిండియా' అంటూ ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠవాల కరెస్పాండంట్ కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పది విజయాలు సాధించిన టీమిండియా జట్టు ఆఖరి పోరులో కూడా అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మిస్ట్రెస్ వై.లక్ష్మి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ

అనంతపురం : స్థానిక జీసెస్ నగర్‌లో ఉన్న ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ సి.సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ రక్త గ్రూపు తెలుసుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఇందులో భాగంగా దాదాపు 460కుపైగా విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపల్ వై.మధుసూదనరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాసులు, ఏవో శ్రీనాథ్, మానవత సంస్థ సభ్యులు ఎ.అమర్నాథ్‌రెడ్డి, కె.సలీంమాలిక్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు జి.ఆనంద్‌బాబు, ఎస్.పురుషోత్తం, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మహమ్మద్, సుహేల్, ప్రజ్వలిత, గిరిజారెడ్డి, పూజిత, చిన్మయి విద్యార్థులు పాల్గొన్నారు.

కరువుపై కనిపించని కదలిక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈసారి తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ పంటలు ఏమాత్రం చేతికొచ్చే అకాశాలు కనిపించడం లేదు. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే కరువు మండలాలను ప్రకటించింది. అయితే మండలాల ప్రకటనపై సరైన విధానం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా సత్యసాయి జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ప్రతిపక్షాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్నిప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. సిఎం జగన్ అంతక మునుపు వారంలో పుట్టపర్తికి విచ్చేసిన సమయంలోనూ కరువు పెద్దగా లేదన్న విధంగా మాట్లాడారు. ఇప్పుడు కరువు మండలాల్లో పంటనష్టం అంచనాలు రూపొందించేందుకు జీవో.5ను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఈ జీవో ప్రకారం కరువు నష్టం అంచనాల్లోనే కోత పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎందుకంటే పంటనష్టం 33 శాతానికి మించి ఉంటేనే నష్టం అంచనా వేయాలన్న నిబంధనా ఉంది. అదే రకంగా ఐదు ఎకరాలకు మించి భూమి ఉన్నా నష్టం అంచనా మాత్రం ఐదు ఎకరాలకే వేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ కోతలపై విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. నష్టమంటే అంతటికీ వస్తుందికానీ, కొంతటికే పరిమితం చేయడం ఏంటన్న ప్రశ్నను లేవనెత్తుతున్నారు. నష్టం అంచనాల్లోనే కోత పెడితే.. రైతుకు అందే సహాయం ఎంతుంటుందన్నది సందేహాలూ సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా నష్ట పరిహారాన్ని మొత్తానికి అంచనా వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. కాని ప్రభుత్వం దీన్ని ఏ మాత్రం పట్టించుకునే పరిస్థితులు లేవన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. ఇంకోవేపు వచ్చే వారం నుంచి సాగునీటి కష్టాలు మొదలుకానున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. 2018 తరువాత ఈ సంవత్సరం తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు అందుతున్న నీరు కేవలం 16 టిఎంసిల్లోపే ఉంది. అది కూడా నవంబర్ 20తో ముగియనుంది. సాధారణ నీరు జనవరి ఆఖరి వరకూ జిల్లాకు వస్తాయి. కానీ రెండు మాసాలకు ముందే నీరు ఆగిపోవడంతో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద సాగు చేసిన పంటలకు నీటి ఎద్దడి ఏర్పడనుంది. సరిగ్గా గింజ పడుతున్న సమయంలో నీరు లేకపోతే మొత్తం పంట ఎండిపోనుంది. ఇది రైతుల్లోనూ ఆందోళన నెలకొంది. ఇతర ప్రాంతాల్లోనూ ఆయకట్టు రైతుల్లో ఈసారి ఏమవుతుందోనన్న భయం వెంటాడుతోంది. కాని ఇప్పటి వరకు ప్రభుత్వ స్థాయిలో ప్రజాప్రతినిధులెవరూ పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనేకసార్లు ఉమ్మడి అనంతపురం జిల్లాకు వచ్చిపోతున్నా కరువు పరిస్థితులపై సమీక్ష జరిపిన దాఖలాల్లేవు. అధికారుల స్థాయిలోనే ఇవి జరుగుతుండటం గమనార్హం. గతంలో అయితే ఇలాంటి పరిస్థితులున్నప్పుడు ప్రజాప్రతినిధుల స్థాయిలో సమీక్షలు జరిపి ప్రత్యామ్నాయలు ఆలోచించి కరువులో రైతులను కొంత వరకైనా ఆదుకునేందుకున్న మార్గాలను అన్వేషించేవారు. కానీ అత్యధికంగా అధికార పార్టీ ప్రజాప్రతినిధులే ఇక్కడున్నా ఎవరై రైతాంగ సమస్యలను పట్టించుకుంటున్న పరిస్థితుల్లేవు. నష్టం అంచనాల్లో కోతలపైనా కూడా ఇప్పటి వరకు ఆ పార్టీ నేతలెవరూ స్పందించలేదు. దీనివల్ల జిల్లా రైతాంగానికి తీరని నష్టం జరిగే అవకాశాలున్నాయన్న ప్రతిపక్షాల మాటలను సైతం ఎవరు పట్టించుకోకపోవడం గమనార్హం.